క్లుప్తంగా

విద్యతోనే అభివృద్ధి సాధ్యం



విద్యార్థులతో సంగ్రాం మహరాజ్

నారాయణఖేడ్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని అఖిల భారత సాధు సంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహరాజ్ అన్నారు. ఖేడ్ మండలం పలుగుతండా ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న విద్యార్థులు, చిన్నారులకు మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యులు రవీందర్ నాయక్‌లు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, బ్లాంకెట్లు, ఇతర విద్యా సామగ్రిని సొంత ఖర్చుతో సమకూర్చి బుధవారం సంగ్రాం మహరాజ్ చేతుల మీదుగా పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో చదివేది పేదల పిల్లలేనని తెలిపారు. దాతలు తమవంతు సహకారం అందించడం అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయులు దత్తురావు, మాజీ సర్పంచ్ చప్లిబాయి, అంగన్‌వాడీ టీచర్ ఇంద్రిబాయి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు



ప్రారంభమైన రోడ్డు నిర్మాణం పనులు

సంగారెడ్డి టౌన్: మండలంలోని ఇస్మాయిల్ ఖాన్ పేట గ్రామంలో మూడు సంవత్సరాల నుంచి రోడ్డు సరిగ్గా లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మాజీ సర్పంచ్ బలరం ఆధ్వర్యంలో ఎపిటోరియా పరిశ్రమ వారి సహకారంతో రోడ్డుకు మరమ్మతులు చేశారు. ఇస్మాయిల్ ఖాన్ పేట నుంచి గ్రామ పరిధి వరకు తొమ్మిది లక్షల నిధులను మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో మంజూరు చేశారు. గత మూడు ఏళ్ల నుండి ఉన్న ఇబ్బందులు తొలగడంతో గ్రామస్తులు పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

కూల్చిన వాటిని మళ్లీ నిర్మిస్తే చర్యలు

పంచాయతీ కార్యదర్శి సుభాష్



నిర్మాణాన్ని కూల్చివేస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు టౌన్: కూల్చివేసిన అక్రమ కట్టడాలను మళ్లీ నిర్మిస్తే కఠిన చర్యలు తప్పవని ఇంద్రేశం గ్రామ పంచాయతీ కార్యదర్శి హెచ్చరించారు. బుధవారం పటాన్‌చెరు మండలంలోని ఇంద్రేశం గ్రామ పరిధిలో పీఎస్‌ఆర్ టౌన్‌షిప్‌లో గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులను మించి భవనం నిర్మిస్తుండటంతో నోటీసులు జారీ చేశారు. అయినా వినకుండా పనులు చేస్తుండడంతో కూల్చివేసినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ నుంచి తీసుకున్న అనుమతులు మేరకు నిర్మాణం చేపట్టాలని సుభాష్ తెలిపారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి



ఏఈకి వినతిపత్రం ఇస్తున్న రాంచందర్ తదితరులు

జహీరాబాద్ టౌన్: మండలంలోని కోత్తూర్(బి) నుంచి బుర్దిపాడ్ వరకు చేపట్టిన రోడ్డు పనులు నాసిరకంగా ఉన్నాయని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి రాంచందర్ డిమాండ్ చేశారు. బుధవారం పంచాయత్‌రాజ్ ఏఈని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్షల రూపాయలతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణంలో నాణత్యపాటించడం లేదని, మొక్కుబడిగా పనులు చేపట్టడంతో వెంటనే దెబ్బతింటుందని వాపోయారు. రోడ్డును పరిశీలించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట సీపీఎం నాయకులు ఉన్నారు.

ఎస్ఐ, సీఐ బదిలీ

కొండాపూర్(సంగారెడ్డి): కొండాపూర్ ఎస్సై భరత్‌కుమార్‌రెడ్డి, సీఐ వెంకటేశ్ ఒకేసారి బదిలీ అయ్యారు. ఎస్సై భరత్ కుమార్‌రెడ్డి వికారాబాద్ జిల్లాకు, సీఐ వెంకటేశ్ సదాశివపేట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో కొండాపూర్ ఎస్సైగా అమీన్‌పూర్‌లో విధులు నిర్వహిస్తున్న సోమేశ్వరి, సంగారెడ్డి పట్టణంలో ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహిస్తున్న సుమన్‌కుమార్ కొండాపూర్ సీఐగా నియామకమయ్యారు.

వసతి గృహాల్లో సమస్యల తిష్ట

- ఊడిపోయిన తలుపులు, కిటికీలు
- చిరిగిపోయిన దుప్పట్లు, జాలీలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



హాస్టల్‌లో చిరిగిపోయి ఉన్న బెడ్లు



ఊడిపోయిన గది తలుపు



పెచ్చులూడిన పైకప్పు



కిటికీ వద్ద చిరిగిపోయిన జాలి

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇక్కడ ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వెరసి అధికారుల నిర్లక్ష్యం, నిర్వహణ అధ్వానంతో పాటు ఏళ్లు గడుస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు. సరైన వసతులు లేకపోవడం, పరిశుభ్రతతో పాటు అనేక రకాల సమస్యలు తిష్ట వేశాయి.

వసతుల చింత

ఝరాసంగంలోని ఎస్సీ సంక్షేమ వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఇందులో 80 మందికి పైగా విద్యార్థులు ఉంటున్నారు. హాస్టల్‌లో పలు చోట్ల పెచ్చులు ఊడిపోయి ప్రమాదకరంగా మారింది. వర్షాలు కురిసిన సమయంలో గోడలు పూర్తిగా తడిసి ముద్దవుతున్నాయి. దీంతో మరింతగా పెచ్చులు ఊడిపోయే పరిస్థితులు ఉన్నాయి. విద్యార్థులు పడుకోవడానికి అందించిన బెడ్స్ పూర్తిగా చిరిగిపోయాయి. దీంతో పడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గదులకు ఏర్పాటు చేసిన తలుపులు ఊడిపోయే స్థితిలో ఉన్నాయి. దోమల బారి నుంచి రక్షణ పొందేందుకు కిటికీలకు ఏర్పాటు చేసిన జాలీలు పూర్తిగా చిరిగిపోయాయి. దీంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. అంతే కాకుండా మరుగుదొడ్ల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో కంపుకొడుతున్నాయి.

పట్టించుకోని అధికారులు

విద్యార్థులు అవస్థలు పడుతున్నా స్థానిక అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. సంబంధిత హాస్టల్ వార్డెన్ స్థానికంగా ఉండటం లేదు. విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్న అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకొని వసతి గృహంలో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

మత్తు రహిత సమాజాన్ని నిర్మిదాం



జిన్నారం (పటాన్‌చెరు) సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రభాకర్

సంగారెడ్డి క్రైమ్: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ.. మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దామని పట్టణ సీఐ రమేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని కాకతీయ పాఠశాలల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వార్షికోత్సవాలు -2025లో భాగంగా విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ..విద్యార్థులు, యువత చదువుపై దృష్టి సాధించాలన్నారు.మత్తు పదార్థాలు వాడకంతో భవిష్యత్ నాశనం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై నర్సింలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను నిర్మూలిద్దాం

జిన్నారం (పటాన్‌చెరు): నిషేధిత మాదకద్రవ్యాలను నిర్మూలించాలని పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్ అన్నారు. బుధవారం బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని సూర్యదేవర ఫంక్షన్ హాల్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. యువకులు విద్యార్థులు మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా దుష్పరిణామాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను పోలీసులు స్థానికులతో కలిసి ఆవిష్కరించారు.

మాదకద్రవ్యాలపై సమష్టి పోరాటం

నారాయణఖేడ్: మాదక ద్రవ్యాల సమస్య సామాజిక సమస్యగా మారింది. దీనిని నివారించేందుకు అందరం సమష్టిగా పోరాడాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ రహీం పిలుపునిచ్చారు. మనూరు మండలం బోరంచ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో కమిషన్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా చెడు వ్యసనాలకు అలవాటు పడితే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్నేహితులు గుర్తించి ప్రాథమిక స్థాయిలోనే నివారించాలని సూచించారు. తద్వారా వారిని మత్తుపదార్థాల బారినుంచి కాపాడగలమని అన్నారు.

అక్రమంగా వేసిన రోడ్డు తొలగింపు



రోడ్డును తొలగిస్తున్న అధికారులు

కంది(సంగారెడ్డి): హెచ్‌ఎండిఏ లేఅవుట్ భూముల్లో అక్రమంగా చేసిన రోడ్డును హెచ్‌ఎండీఏ అధికారులు బుధవారం తొలగించారు. కంది శివారులోని సర్వే నంబర్ 656లో గత ప్రభుత్వం హెచ్‌ఎండీఏ లేఔట్ కోసం సుమారు 68 ఎకరాల భూమిని అసైన్‌మెంట్ దారుల నుంచి తీసుకొని లేఅవుట్ ఏర్పాటు చేసింది. ఎకరాకు 600 గజాల ప్లాటును భూమిని సాగు చేస్తున్న రైతులకు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్రమంలో కొందరు తమ భూములకు రోడ్డు కావాలని పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న హెచ్‌ఎండీఏ అధికారులు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకారంతో అక్రమంగా ఏర్పాటు చేసిన రోడ్డును తొలగించారు. అలాగే భూమి చదును పనులు కూడా ప్రారంభించి కొంచమేరా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. హెచ్‌ఎండీఏకు కేటాయించిన స్థలంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తామని తహసీల్దార్ రవి కుమార్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ డీఈ ప్రసాద్, సీఐలు వెంకటరామిరెడ్డి, సతీష్‌తో పాటు ఎస్సైలు రవీందర్, విజయకుమార్,ఆర్‌ఐ రంగయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆషాఢ మాస బోనాలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న మహిళలు

సంగారెడ్డి టౌన్: ఆషాఢ మాస ప్రారంభం సందర్భంగా బుధవారం సంగారెడ్డి పట్టణంలోని నల్ల పోచమ్మ ఆలయంలో వైకుంఠపురం దేవాలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజ చేశారు. మహిళలు బోనాలు అమ్మవారికి సమర్పించారు. ఆషాఢమాసం మొదటి పూజ వైకుంఠపురం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అనుమతిలేని స్కూళ్లపై చర్యలు తీసుకోండి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నారాయణఖేడ్: పట్టణంలో అనుమతి లేకుండా ప్రారంభమైన ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కింది దొడ్డి సతీష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఎంఈఓ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా పాఠశాలను ప్రారంభించి.. ప్రవేశాలకు విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అసత్య ప్రచారాలతో విద్యార్థులను చేర్చుకుంటున్న యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేసి పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. జిల్లా నాయకులు శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత



కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని అన్ని గ్రామాలు, తండాల్లో ప్రజలు వర్షాకాలం సీజన్‌లో వచ్చే వ్యాధుల నుంచి అప్రమత్తంగా ఉండాలని కంగ్టి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాగమణి తెలిపారు. కంగ్టి పీహెచ్‌సీలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. సీజన్ మారుతుండడంతో జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులు, విరేచనలు తదితర సమస్యలు తలేత్తే అవకాశం ఉందన్నారు. వంటలు చేసేటప్పుడు, భోజనానికి ముందు చేతుల పరిశుభ్రత పాటించాలన్నారు. అందరికి అందుబాటులో ఆశ వర్కర్ల వద్ద సంబంధిత మాత్రలు, మందులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఏదైనా ఆరోగ్య సమస్య తలెత్తితే తమకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా సంబంధిత ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల సాయంతో వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఏ ఆరోగ్య సమస్యను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

రామకృష్ణకు ప్రతిభ పురస్కారం అంతజేత



ప్రతిభ పురస్కారం అందుకుంటున్న రామకృష్ణ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్ (కె) ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ అంతర్జాతీయ ప్రతిభ పురస్కారాన్ని అందుకున్నారు. వరల్డ్ చారిటీ వెల్ఫేర్ ఫౌండేషన్ ఢిల్లీ వారి ఆధ్వర్యంలో బుధవారం ఏఎస్ రావు నగర్ రెసిడెన్సీ కమ్యూనిటీ హాల్, ఈసీ ఐఎల్ హైదరాబాద్‌లో జరిగిన ప్రతిభ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో చారిటీ వెల్ఫేర్ ప్రతినిధులు దీపాలి, శిరీష మోను చేతుల మీదుగా రామకృష్ణ అవార్డును అందుకున్నారు. విద్యారంగంలో ఆయన చేసిన కృషికి పురస్కారం లభించింది. రామకృష్ణ మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయ పాత్ర ఎంతో విలువైందన్నారు. తనకు అంతర్జాతీయ విద్యా పురస్కారాన్ని అందజేసిన వరల్డ్ చారిటి వెల్ఫేర్ ఫౌండేషన్ ఢిల్లీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. రామకృష్ణను ఎంఈఓ శంకర్, మండల నోడల్ అధికారి సుధాకర్, కాంప్లెక్స్ ప్రధాన ఉపా ధ్యాయురాలు రాజశ్రీ అభినందించారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

కాంగ్రెస్ నేత కాటా శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

జిన్నారం (పటాన్‌చెరు): ప్రభుత్వం రైతు సంక్షేమం కోసమే కృషి చేస్తుందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం జిన్నారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ సంబరాల్లో కాటా శ్రీనివాస్‌గౌడ్ సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని 22 వేల మంది రైతులకు తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలు ఖాతాల్లో జమ చేసిందన్నారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విజయం కార్మికులకు అంకితం

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కారాములు



విజయోత్సవ ర్యాలీలో మాట్లాడుతున్న రాములు

జిన్నారం(పటాన్‌చెరు): పరిశ్రమ యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో బీఎంఎస్‌పై వరుసగా ఐదోసారి సాధించిన విజయం కార్మికులకు అంకితమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కారాములు అన్నారు. బుధవారం మండలంలోని కాజీపల్లి టీఐడీసీ పరిశ్రమలో జరిగిన ఎన్నికల్లో సీఐటీయూ బీఎంఎస్‌పై విజయం సాధించింది. అనంతరం యూనియన్ నాయకులు కార్మికులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరుసగా ఐదోసారి బీఎంఎస్‌పై విజయం సాధించడంపై కార్మికులను అభినందించారు.

ప్రజాభిప్రాయ సేకరణ చేయాలి

నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీధర్

పటాన్‌చెరు టౌన్: పచ్చటి గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చే నిర్ణయంపై ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని నవభారత్ నిర్మాణ్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్టు శ్రీధర్ డిమాండ్ చేశారు. బుధవారం పటాన్‌చెరులో ఏర్పడిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో అనేక గ్రామాలను మున్సిపాలిటీలుగా మారుస్తూ ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుంటే బాగుంటుందన్నారు. గ్రామాల్లో చిన్న, సన్నకారు రైతులు, రైతు కూలీల వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని గ్రామ పంచాయతీ హోదాను కోల్పోతే గ్రామీణ ఉపాధి హామీ పథకాలు వర్తించవని తెలిపారు. గ్రామ కంఠం భూముల్లో ఇంటి నిర్మాణం చేపట్టాలన్న, వ్యవసాయ రుణాల విషయంలో వెసులుబాటు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.

ద్విచక్రవాహనాల వేలం

ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో పట్టుపడిన ఆరు ద్విచక్ర వాహనాలను వేలం చేయనున్నారు. డిప్యూటీ కమిషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ మెదక్ ఆదేశాల మేరకు జిల్లా మద్య నిషేధ అధికారి సమక్షంలో పటాన్‌చెరు ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో గురువారం ఉ.11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనే వారు నిర్ణీత ధరవత్తు చెల్లించి పాల్గొనాలన్నారు.

కుక్కలదాడిలో జింక పిల్ల మృతి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): కుక్కలదాడిలో జింక పిల్ల మృతి చెందిన ఘటన మండలంలోని ఎల్లారం గ్రామశివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం .. ఎక్కడి నుంచో వచ్చిన జింక పిల్లపై కుక్కలు ముక్కుమ్మడిగా దాడి చేశాయి. గమనించిన స్థానికులు కుక్కలను తరిమికొట్టే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోయింది. దీంతో కుక్కల దాడిలో జింక పిల్ల మృతి చెందింది.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న రాజిరెడ్డి

హత్నూర(సంగారెడ్డి): పేదలు అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటే వారికి ముఖ్యమంత్రి సహాయనిధి వరంలా ఆదుకుంటోందని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి అవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. హత్నూర మండలంలోని పలు గ్రామాలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4.53లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పేద ప్రజలను ఆదుకోవాలన్న ఉద్దేశంతో అప్పటి సీఎం దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్‌ను ప్రారంభించారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కృష్ణ, ఆత్మ కమిటీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి నాయకులు మణిదీప్ ,ప్రసాద్, వెంకటేశ్, పెంటయ్య పాటు పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సంగారెడ్డి క్రైమ్: పట్టణంలోని బైపాస్ రోడ్డులో పట్టణ సీఐ రమేష్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాల పత్రాలను పరిశీలించారు. వాహనాల్లో ప్రభుత్వం నిషేధించిన పాన్, గుట్కా వంటి పదార్థాలు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

◆ నేడు విద్యుత్ అంతరాయం

జిన్నారం (పటాన్‌చెరు): 132/33 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా నేడు ఉ.10 గంటల నుంచి 12 గంటల వరకు కిష్టయ్యపల్లి, ఖాజీపల్లి, గ్రామాల్లో విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు ఏఈడీ దుర్గా ప్రసాద్, జిన్నారం ఏఈ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

◆ బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ దరఖాస్తులు

జహీరాబాద్ టౌన్: 2025–26 అకాడమిక్ సంవత్సరంలో బ్యాక్‌లాగ్ సీట్లకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండలంలోని హోతి(కె) బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సురేఖ ప్రకటనలో తెలిపారు. 6, 8,9 తరగతిలో 3 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. ఈ నెల 26న సా.4.30 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని, 27న ఉ.11 గంటల నుంచి 12 గంటల వరకు అర్హత పరీక్ష ఉంటుందన్నారు. మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు.

◆ ఆలయ భూములు కాపాడాలి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలో రామాలయ భూములను కాపాడాలని బుధవారం తహసీల్దార్ పరమేశంను కలిసి కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. మంబాపూర్ గ్రామశివారులోని రామచంద్రస్వామి ఆలయ పాత రికార్డుల ప్రకారం భూములు ఆలయానికి చెందినవని అన్నారు. ప్రస్తుతం ఇతరుల పేర రికార్డు అయినట్లు చూపుతున్నాయని వారి పేర్లను తొలగించి రామాలయ కమిటీకి అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

◆ వర్షాలు కురవాలని పూజలు

ఝరాసంగం(జహీరాబాద్): వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ బుధవారం మండల పరిధిలోని బర్దిపూర్ గ్రామంలో మహిళలు నిండు కలశాలతో దత్తగిరి లోని జ్యోతిర్లింగాల వద్దకు తీసుకెళ్ళి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారికి అభిషేకం, హారతి తదితర పూజలు చేశారు.

◆ పుస్తకాలు విక్రయించే స్కూళ్లపై చర్యలు

కొండాపూర్(సంగారెడ్డి): పుస్తకాలు విక్రయించే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని మల్కాపూర్ చౌరస్తాలో గల కలర్స్ పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తున్నారనే సమాచారంతో పీడీఎస్‌యూ నాయకులు బుధవారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. సందీప్ మాట్లాడుతూ.. జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలో యథేచ్ఛగా పుస్తకాలను విక్రయిస్తున్నప్పటికీ సంబంధిత విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు.

◆ మల్బరీ తోటల సాగుకు ప్రోత్సాహం

జహీరాబాద్ టౌన్: మల్బరీ తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సేరికల్చర్ మండల అధికారి శ్రీనివాస్ అన్నారు. మొగుడంపల్లి, గౌసాబాద్ గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న మల్బరీ తోటలు,షెడ్డులను డీహెచ్‌ఎస్ఓ. సోమేశ్వర్‌రావుతో కలిసి బుధవారం పరిశీలించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. మల్బరీ తోటల సాగు వల్ల తక్కువ పెట్టుబడితో ఏడాది పొడువునా ఆదాయం వస్తుందన్నారు. ఎకరానికి ప్రతి సంవత్సరం రూ. 2 లక్షల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు.

◆ మంత్రిని కలిసిన తహసీల్దార్

సంగారెడ్డి టౌన్: మంత్రి దామోదర్‌ను బుధవారం సంగారెడ్డి తహసీల్దార్ జయరామ్నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజలు సమస్యలు పరిష్కారం చేయాలని సూచించారు.